క్లుప్తంగా

సరైన సమయంలో టీకాలు వేయాలి



వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఎం హెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): చిన్నపిల్లలు, గర్భిణులకు సరైన సమయంలో టీకాలు వేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం నగర శివారులోని ప్రజానగర్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీశారు. మాతాశిశు కార్డులో వివరాలు నమోదు చేస్తున్నారా అని ప్రశ్నించారు. తల్లులకు వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకత గురించి వివరించారు. 10వ తేదీన 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

13న బాలవికాస్ గురువులకు శిక్షణ

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలవికాస్ గురువులకు ఈనెల 13న ఒక్కరోజు శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే కార్యక్రమానికి శిక్షణా శిబిరం, విద్యా విభాగం రాష్ట్ర సమన్వయకర్త శకుంతల హాజరై మార్గదర్శనం చేస్తారన్నారు. బాల వికాస్ గురువులు, ఆక్టివ్ మెంబర్స్, విద్యార్థులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అర్చకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు కల్చరల్: అర్చకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆపన్న ప్రదీపన సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కంచుగంటల శ్యామ్ సుందర్‌రావు, జిల్లా అధ్యక్షులు నాగులవరం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, అర్చక విభాగం ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప బుధవారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలో సహాయార్చకుడు పంద్రంగి నాగేంద్రపవన్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు బీజేపీ ధర్నా

కర్నూలు కల్చరల్: సర్పంచుల హక్కులను కాలరాస్తూ పంచాయతీలకు కేటాయించిన నిధులను దారి మళ్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం రాష్ట్ర కో కన్వీనర్ కపిలేశ్వరయ్య హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

కర్నూలు (టౌన్): నగరపాలకలో గురువారం ఉదయం 11 గంటలకు మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, స్టాండింగ్ కమిటీ సభ్యులు కై పా పద్మలతారెడ్డి, నగరూరు శ్రీనివాసరావు, జీఎల్‌వీ సుజాత, ఆత్మకూరు నాగలక్ష్మిరెడ్డి, సంగాల సుదర్శన్‌రెడ్డితో పాటు నగరపాలక అధికారులు పాల్గొని అభివృద్ధి పనులపై చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నారని మేయర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

వృత్తిలో నైపుణ్యం సాధించాలి

కర్నూలు (టౌన్): సచివాలయాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులు వృత్తిలో నైపుణ్యాన్ని సాధించాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు సూచించారు. బుధవారం స్థానిక సీతారామనగర్‌లోని స్కిల్ అప్‌గ్రెడేషన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డిజిటల్ సేవలతో పాటు పరిపాలన అంశాలపై మరింత అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ వాసు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్‌లో 50 శాతానికిపైగా మార్కులు సాధించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు ఈ నెల14వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు

- బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్ కోరారు. బుధవారం సాయంత్రం సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో అర్హులైన పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదనే అంశంపై చర్చ జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే జగనన్న చేదోడు, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా, వసతి దీవెన, కాపు నేస్తం, బీసీ నేస్తం, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలని కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ కిషోర్‌కుమార్ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందుకు సంబంధించి ఆయా సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి వెంటనే ఈకేవైసీ చేయించాలన్నారు. అలాగే బ్యాంకుల్లో వారి ఖాతా నంబర్లకు ఆధార్ నంబర్‌ను లింకు చేయించాలన్నారు. ఎలాంటి సాంకేతిక కారణాలతో పథకాలు నిలిచిపోయాయో గ్రామ సచివాలయాల వారీగా లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ నాగమణి, సాంఘిక సంక్షేమ శాఖ పర్యవేక్షకులు శివారెడ్డి హాజరయ్యారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య
- 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని నంద్యాల, కర్నూలు వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు మారుతి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయడానికి ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. కాలనీ వాసులు తాగునీటి సమస్య, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే, మేయర్‌ను కోరారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.115 కోట్లు కేటాయింపు

కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తుండటంతో ఆయాకాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.115 కోట్లతో తొమ్మిది ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగలక్ష్మిరెడ్డి, విక్రమసింహారెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన





మహాగౌరి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞంలో భాగంగా విశేష పూజలు జరిగాయి. గణపతి పుణ్యాహవచనం, మంటపారాధన, లలిత సహస్రనామ పారాయణ పూర్వక సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, లలితా సంఘం అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన తరువాతే ఈ క్రాప్

కర్నూలు(సెంట్రల్): రైతులు వేసిన పంటలను స్వయంగా పరిశీలించిన తరువాతే ఈ క్రాప్ బుకింగ్ చేపట్టాలని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా సూళ్లురుపేట వ్యవసాయ డివిజన్ దేవసత్రం మండలం తళ్లంపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో నకిలీ ఈక్రాప్‌తో కొందరు రైతులు వ్యవసాయానికి అనువుకాని పొరంబోకు భూముల్లో వరి వేసినట్లు చూపి ఈక్రాప్ బుకింగ్ చేయించారు. దీని ఆధారంగా రైస్ మిల్లులకు వరిని అమ్మినట్లు నకిలీ పత్రాలు పుట్టించి రూ 41.26 లక్షలను కాజేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో లోకాయుక్త మీడియాలో ప్రచురితమైన కథనాన్ని సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు తళ్లంపాడు ఆర్‌బీకే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతికి రెండు ఇంక్రిమెంట్లలో కోత విధించారు. దొరవారి సత్రం మండల వ్యవసాయాధికారి కాంచనను సస్పెండ్ చేయడంతో పాటు ఇద్దరు రైతుల నుంచి రూ.18,07,210 రికవరీ చేసినట్లు బుధవారం లోకాయుక్తకు నివేదిక సమర్పించారు. చైర్మన్ స్పందిస్తూ అక్రమాలకు పాల్పడిన రైతులపై ఏమి చర్యలు తీసుకున్నారో తెలపాలని కోరుతూ విచారణను 2023 అక్టోబర్ 20వ తేదీకి వాయిదా వేశారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు సిటీ: స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరముందని ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో బుధవారం జరిగిన నా మట్టి–నా దేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు మల్లికార్జున, రామకృష్ణ, విజయశేఖర్, నాగమోహన్, సుజాత, జబీన్ అక్తర్, గిరిజా రాణి పాల్గొన్నారు.

అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీకి కర్నూలు న్యాయవాది



న్యాయవాది కె.మద్దిస్

కర్నూలు(లీగల్): బెంగళూరులో ఈ నెల 11 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే దక్షిణ భారత అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీకి ఏపీ జట్టులో కర్నూలు న్యాయవాది కె.మద్దిస్‌కు చోటు దక్కింది. గతంలో జరిగిన అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలలో బ్యాటింగ్‌లో రాణించడంతో ఏపీ జట్టులో స్థానం దక్కిందని మద్దిస్ బుధవారం తెలిపారు. కాగా ఏపీ జట్టుకు మద్దిస్ ఎంపిక కావడంతో కర్నూలు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

27న జిల్లా మాతృశక్తి సమ్మేళనం



కరపత్రాలు విడుదల చేస్తున్న మాతృశక్తి, దుర్గా వాహిని ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృ శక్తి ఆధ్వర్యంలో ఈనెల 27న స్థానిక భరత మాత ఆలయ ప్రాంగణంలో 'మాతృశక్తి సమ్మేళనం' నిర్వహించనున్నట్లు మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ గౌరి తెలిపారు. బుధవారం రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ మహిళలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను ప్రశ్నించడం, హిందూ మహిళల సంఘటన, సమైక్యత వంటి విషయాలపై వక్తలు ప్రసంగిస్తారన్నారు. మాతృ శక్తి, దుర్గా వాహిని విభాగాల్లో కార్యకర్తలను విస్తరించడంపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా కన్వీనర్ జంపాల రాధిక మాట్లాడుతూ తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు రమాదేవి ప్రధాన వక్తగా హాజరై మార్గదర్శనం చేస్తారన్నారు. హిందూ సమాజానికి చెందిన మహిళలు, వివిధ ధార్మిక సంఘాల మహిళా కార్యకర్తలు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నగర కన్వీనర్ భార్గవి, జిల్లా దుర్గా వాహిని కన్వీనర్ లక్ష్మి, ప్రఖండ ప్రతినిధులు రాధ, శిరీష, రామతులసి, అరుణ, నాగలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో బుధవారం నలుగురు విద్యార్థులు డిబారైనట్లు వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ సెమిస్టర్‌కు 9,958 మంది గానూ 8,996 మంది విద్యార్థులు హాజరయ్యారని, మిగతా 962 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

సర్వేలో పార్టీల ఏజెంట్లు పాల్గొనాలి

- అధిక ఓటర్లు ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వేలో బీఎల్‌ఓలతోపాటు రాజకీయ పార్టీల ఏజెంట్లు పాల్గొనాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. బుధవారం సాయంత్రం మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలిసి ఓటరు సవరణ జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 25 శాతం ఇళ్లను మాత్రమే బీఎల్‌ఓలు తనిఖీ చేశారని, రాష్ట్రవ్యాప్తంగా కూడా 25 శాతమే పూర్తయిందని చెప్పారు. కర్నూలు, ఆదోనిలలో ఎక్కువగా ఒకే ఇంట్లో ఓటర్లు అధికంగా ఉన్న నివాసాలపై దృష్టి సారించాలన్నారు. ఒకే ఇంట్లో ఎక్కువ కుటుంబాలు ఉండడంతోనే ఎక్కువ ఓటర్లు ఉంటున్నట్లు తెలుస్తోందన్నారు. కుటుంబాల వారిగా విభజించి వేర్వేరు ఇంటి నంబర్లను ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో బీఎల్‌ఓలకు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఇదే క్రమంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు సర్వేలో పాల్గొంటే ఎందుకు ఒకే ఇంట్లో అధికంగా ఓట్లు ఉన్నాయో వారికే అర్థమవుతుందన్నారు. జిల్లా మొత్తంలో జరుగుతున్న ఇంటింటి సర్వేలో ఓటర్లుగా నమోదు చేయడం, తొలగించడం విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. అన్ని కార్యాలయాల వద్ద పోస్టర్లు వేయించాలన్నారు. వీడియో, ఆడియోల ద్వారా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ డీటీ మురళీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు, మునిసిపల్ గ్రీన్ అంబాసిడర్లు, వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. వీఆర్‌ఏలపై వేధింపులను ఖండించాలని కోరారు. అనంతరం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, ఈరన్న, నారాయణ స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథాను అరికట్టాలి

కర్నూలు (న్యూసిటీ): నగరంలో బాగున్న కాలువలు, కల్వర్టులను కూలగొట్టి కొత్తవి నిర్మిస్తూ ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందని సీపీఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ ఆరోపించారు. 90 శాతం శిథిలమైన కాలువలను పట్టించుకోకుండా బాగున్న కాలువలు, కాల్వర్టులను కూల్చి కొత్తగా వేయడంతో ప్రజాధనం ఎంత వృథా అవుతుందో మున్సిపల్ అధికారులు గమనించాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా నగరంలో 15 రోజుల నుంచి తమ పార్టీ నాయకులు బృందాలుగా ఏర్పడి పర్యటించి సమస్యలు తెలుసుకున్నామన్నారు. శిథిలమైన కాలువలు నిర్మించకపోవడంతో దుర్వాసనతో దోమలు చేరి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పాత బస్టాండ్‌లో జరుగుతున్న అనవసరమైన పనులపై విచారణ చేసి ప్రజాధనాన్ని వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆశా వర్కర్లపై వేధింపులు ఆపాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కర్నూలు(హాస్పిటల్): వివిధ పీహెచ్‌సీలలో ఆశా వర్కర్లపై జరుగుతున్న వేధింపులను ఆపాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమీజాబీ కోరారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమీజాబీ మాట్లాడుతూ ఆశాలకు సంబంధం లేని ఇతర పనులు చెప్పి పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది వేధిస్తున్నారన్నారు. కొందరు మెడికల్ ఆఫీసర్లు తమ ఆసుపత్రికి రోగులను తీసుకురావాలని వేధిస్తున్నట్లు ఆరోపించారు. అలా చేయని వారిపై నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆశాలు డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.గోపాల్, పి.వీరన్న, ఉమాదేవి పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కార్యాచరణ

కర్నూలు(న్యూసిటీ): స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు పార్లమెంట్, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ముందుగా నందమూరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ, వార్డులకు ఉప ఎన్నికలు జరగనుండడంతో అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జులకు బీటీ నాయుడు సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా మార్పులు, చేర్పుల వివరాలను బీఎల్‌ఓల ద్వారా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కోట్ల సుజాతమ్మ, కె.మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి, కేఈ శ్యామ్‌కుమార్, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్నూలు పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

స్వర్ణకారుడి ఆత్మహత్యాయత్నం

కర్నూలు(అర్బన్): నగరంలోని గణేష్ నగర్‌కు చెందిన స్వర్ణకారుడు రమేష్ ఆచారి బుధవారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్వర్ణకార వృత్తిని చేస్తున్న ఇతను స్థానిక కోల్స్ చర్చి వద్ద గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు (న్యూసిటీ): జిల్లా వ్యాప్తంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఈ.శ్రీరాములుగౌడ్ కోరారు. బుధవార సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1947లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు విజయ్, రవి, రంగస్వామి, రాజశేఖర్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వంతెన నిర్మించాలి



ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కల్లూరు: వక్కెర వాగుపై నూతన వంతెన నిర్మించాలని కల్లూరు పరిరక్షణ సమితి నాయకులు కోరారు. బుధవారం సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో కల్లూరు పెద్దలతో కలసి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలసి వినతి పత్రం అందించారు. చంద్రశేఖరప్ప మాట్లాడుతూ కల్లూరులో వక్కెర వాగుపై దాదాపుగా 60 సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు సరిపడే విధంగా కాజ్‌వే నిర్మించారన్నారు. ప్రస్తుతం నగరం విస్తరించడంతో ఈ వంతెనపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. కర్నూలు నగరంలోకి చేరుకోవాలంటే ఎంతో కీలకమైన ఈ వంతెన పూర్తి శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు. వరదల సమయంలో ప్రవాహాన్ని అంచనా వేయలేక చాలా మంది కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు, కల్లూరు పెద్దలు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రమణమూర్తి, గోవిందు, విశ్వనాథం పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం పడిదెంపాడులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

'క్విట్ ఇండియా'తోనే స్వాతంత్య్రం

కర్నూలు (న్యూసిటీ): క్విట్ ఇండియా నినాదంతోనే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొండారెడ్డి బురుజు నుంచి ర్యాలీగా వెళ్లి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త, నగర అధ్యక్షుడు జాన్‌విల్సన్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బజారయ్య, కోడుమూరు ఇన్‌చార్జ్ దామోదరం రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో బీజేపీని తరిమికొడతాం



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): క్విట్ ఇండియా స్ఫూర్తితో బీజేపీని తరిమికొడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ,ఎండీ అంజిబాబు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట క్విట్ కార్పొరేట్..సేవ్ ఇండియా..సేవ్ అగ్రికల్చర్ నినాదాలతో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్‌కు ధారాదత్తం చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని కుదేలుచేసి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తెచ్చారన్నారు. వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడితో అన్నదాతలకు ఏ మాత్రం గిట్టుబాటు కావడంలేదన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నిర్మల, రామాంజనేయులు, రాముడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన పెంచుకోండి



మేనేజర్ శ్వేతకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్, తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్లూరు శాఖ మేనేజర్ ఎ.శ్వేత తెలిపారు. బుధవారం స్వాతంత్య్ర అమృత్ మహోత్సవం సందర్భంగా కల్లూరులోని ఆదిత్య విద్యానిలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్వేత మాట్లాడుతూ 8– 10 తరగతి విద్యార్థులకు డబ్బును పొదుపు ఎలా చేయాలి,బ్యాంకు ద్వారా పొదుపు చేయడం వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవయ్య, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.